# అందని ఆ రెండు ఫలాలు

"ఏమన్నాడయ్యా హెడ్ గుమాస్తా?...అని పరాంకుశం పలుకరించాడు ఇసాక్‌ను.

"పోనీ, చూద్దాం అన్నాడు" అని చెప్పాడు ఇసాక్.

'అంటేమని, పోయాక చూద్దమనేగా?' అంటూ నవ్వాడు పరాంకుశం. ఇసాక్‌కు కూడా నవ్వు వచ్చింది కాని అది నవ్వే సందర్భంకాదు.

అయిదు నిమిషాల క్రిందట ఇసాక్ స్కూలు ఆఫీసు గదిలోకి వెళ్ళి హెడ్ గుమస్తాకు నమస్కారం చేసి ఎంతో అణకువగా తన తండ్రి పరిస్థితి బొత్తిగా బాగులేదనీ రోజు రోజుకూ ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చి ఇప్పుడు బాగా ఆందోళనకరంగా మారిందనీ, వీధి చివరి వైద్యుడు అప్పుడే పెదవి విరిచి పెద్దాసుపత్రికి తీసుకువెళ్ళితే మంచిదని చెప్పాడనీ విన్నవించుకున్నాడు. హెడ్ గుమాస్తా అంతావిని "అయితే నన్నేం చెయ్యమంటావు?" అని అడిగాడు. "డబ్బుసార్... కొంచెం డబ్బు కావాలి?" అన్నాడు ఇసాక్, ఆయన అప్పుడు చిత్రంగా అన్నమాట - పోనియ్. చూద్దాంలే.అని

పైన ఎత్తుగా గుబురుగా దట్టంగా పెరిగిన నిద్రగన్నేరు చెట్టు ఆకులు ముడుచుకుని అప్పుడే నిద్రకు ఉపక్రమించినట్లున్నది. ఆ చెట్టు ఇరవై ఏళ్ళనాటిది. ఆ స్కూలు మొదలు పెట్టిన మొదటి సంవత్సరం నుంచీ ఆ స్కూలువలెనే దినదినాభివృద్ధి చెంది శాఖోప శాఖలుగా విస్తరించి నేటికి ఇలా మహోన్నతంగా ఉంది. అప్పటి నుంచీ ఇసాక్ ఆ స్కూలు బస్సుడ్రయివరుగా పని చేస్తూనే ఉన్నాడు. ఇరవై ఏళ్ల ప్రాయంలో ఆ బస్సు చక్రం పట్టి, నడివయస్సు దాటినా ఇంకా ఆ పనిలోనే ఉన్నాడు. ఆ స్కూలు పెరిగింది. భవనాలు పెరిగాయి. విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఆదాయాలు లక్షలు, కోట్లలో పెరిగిపోయాయి. విద్యార్థుల కోసం మరి రెండు బస్సులు వచ్చాయి. అవి నగరంలో అన్ని మూలలకూ తిరుగుతూ ఉంటాయి.

ఎదురుగా మాయామహల్ లాంటి అద్భుతమైన కట్టడం. లెక్కలేనన్నీ గదులు... వేల సంఖ్యలో విద్యార్థులు.

ఇంక కొద్ది సేపటిలో విద్యార్థులు- చిన్నా పెద్ద అందరూ- బిలబిలమంటూ బయటికి వస్తారు. పూల బంతుల్లాగా, గాలి బుడగల్లాగా, గలగలలాడుతూ...పరుగులు పెడుతూ... కొందరు పిల్లల తల్లిదండ్రులు గేటు బయట ఉంటారు. ఈ సమయంలో - పదుల సంఖ్యలో ఖరీదైన స్వదేశీ విదేశీ కారులు...కొన్ని ఆటోలు...మరికొన్ని రిక్షాలు...

ఇసాక్ పచ్చికలో కూలబడి ఉన్నాడు. మనసులో దృశ్యాలు...ముందు తమ ఇల్లు...పెద్ద ఇంటిలో చివరి రెండు గదుల భాగం...ముందు గదిలో కిటికీ పక్కన మంచంలో తండ్రి... ఎవరెప్పుడు ఏమని పలకరించినా అన్నిటికీ సమాధానంగా దగ్గుతూ 'అల్లా పిలుపుకోసం ఎదురుచూస్తున్నాను' అంటూ ఉంటాడు. బంగ్లాదేశ్ యుద్ధంలో అబ్దుల్

హమీద్‌కు పరమవీరచక్ర మిగిలితే , ఇతనికి ఒక కాలు పూర్తిగాపోయి అవిటివాడై మిగిలిపోయాడు. ఇప్పుడిక చివరి దశ చివరి రోజులుకూడా గడిచి చివరకు గంటలు మిగిలినట్టున్నాయి.

ఇసాక్ చేతివ్రేళ్లు విరుచుకుని పండిన గడ్డం నిమురుకున్నాడు. కొన్ని చిన్న క్లాసులు వొదిలారు. పరాంకుశం బస్సు పిల్లలకోడిలా కదిలి వెళ్ళిపోయింది. కొన్ని కార్లు కూడా కదిలిపోయాయి.

ఇసాక్ తన మొదటి కొడుకు పుట్టగానే ఎన్నో కలలు కన్నాడు. వాణ్ణి బాగా చదివించి పెద్ద ఉద్యోగస్తుడిగానో ఆఫీసరుగానో చెయ్యాలని ఎంతో అనుకున్నాడు. హబీబ్ మంచివాడు నెమ్మదస్తుడు. ఏళ్లు గడిచేకొద్దీ తండ్రిని గురించి, తమ ఆర్థిక స్థాయిని గురించీ ముందే అర్థం చేసుకున్నాడు. చదువు చాలా ఖరీదైనదనీ, తమకు అందరానిదనీ తేల్చుకుని వయసురాగానే పెద్దలనాశ్రయించి నగర కబేళాలో స్థిరపడిపోయాడు. ఉన్నంతలో తృప్తిపడటం నేర్చుకుని తనకు తగిన పిల్లను పెళ్ళాడి విడిగా ఉంటున్నాడు.రెండో వాడు అన్వర్. వీడు బొత్తిగా లాభం లేదు. బుద్ధిమంతుడే గాని చదువు అబ్బలేదు. పైగా వేలు వేలు ధారపోసి అందమైన చదువును 'కొనే' తాహతులేకపోయె. వీధి చివరి చవక బడులలో కొంతమేర చదివి విరక్తుడై ఒక స్కూటర్ మెకానిక్ దగ్గర కుదురుకున్నాడు. వాడికి అందులో ఆనందం లభించింది. చిన్న చిన్న తప్పులకే కాక తప్పు చేయక పోయినప్పటికి మెకానిక్ స్కూటర్ చెయిన్లూ, సైకల్ ట్యూబులూ పెట్టి చావగొట్టేవాడు. మొదట్లో తన కొడుకును కొడతాడా అని ఇసాక్ కోపం తెచ్చుకునేవాడు. కాని కొడుకు అంతంత దెబ్బలు తింటూ కూడా కిమ్మనకుండా సహిస్తూ సర్దుకుపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడు. అప్పుడప్పుడు "ఏరా? వాడు చచ్చేట్టు కొడుతూ వుంటే ఎందుకక్కడ చాకిరీ చెయ్యడం?" అని అడిగితే వాడు ఆరిందాలాగా నవ్వి "అట్టా అయితే తప్ప పని చేతకాదయ్యా" అనేవాడు. వాడిప్పుడు ఆ మెకానిక్ దగ్గర అసిస్టెంట్ స్థాయికి ఎదిగిపోయాడు. మరి కొన్నాళ్ళలో కొందరు స్కూటరు యజమానులను మంచి చేసుకుని మరోచోట స్వతంత్రంగా చిన్న షెడ్డు ప్రారంభించే స్థాయికి చేరుకున్నాడు. పరాంకుశం అప్పుడప్పుడు "మీవాడు దెబ్బలు తింటున్నాడని బాధ పడేవాడివి. ఇప్పుడు చూడు. వాడు తన కింద మరి కొందరు పిల్లలను పెట్టుకుని వాళ్లను కొట్టడం మొదలుపెడతాడు. అంటూ ఉంటాడు.

ఇసాక్ మళ్ళీ చేతివ్రేళ్ళు విరుచుకుని ఆవులించాడు. వచ్చేటప్పుడు పోయేటప్పుడు తన బస్సు నిండా పిల్లలుంటారు. ఆడపిల్లలూ, మగపిల్లలూ, పూలబంతుల్లాగా... కలకలలాడుతూ... వాళ్ళే, ముందు తరం దేశ పాలకులు అధికారగణమూ... అందరూ ఎక్కడి వారక్కడ దిగిపోయాక ఆ ఖాళీబస్సు శూన్యంగా అసహ్యంగా ఉంటుంది. ప్రాణంలేని ఎముకలగూడులాగా...దాన్ని షెడ్‌లో పెట్టి తన సైకిల్ మీద ఆ మూడు నాలుగు కిలోమీటర్లు జనారణ్యం వంటి సిటీ వీధుల్లో ఇంటికి చేరుకుంటాడు.

ఇవాళ ఉదయం బస్సు బయటికి తీస్తుండగా స్కూలు గేటు దగ్గర అందాల ఉడుత ఒకటి అడ్డంగా పరుగెత్తుకు వచ్చింది. దాన్ని తప్పిద్దామని ఎంత ప్రయత్నించినా తనకు సాధ్యం కాలేదు. వెనక చక్రం క్రింద పడి క్షణంలో అణిగిపోయింది. బస్సు ఆపి దిగి వెళ్ళి చూశాడు. ఘోరమనిపించింది. కళ్లనీళ్లు తిరిగాయి. మరోపాపం చేసినట్టని

పించింది. పరాంకుశం మాత్రం అదివిని నవ్వి 'సదేలే...ఈ మాత్రం దానికే డీలాపడితే మనం బతికినట్టే... మనుషులే లెక్కలేకుండా పోతున్నారు. కొంపలేమీ మునిగిపోవడం లేదు పదపద' అన్నాడు.

ఇసాక్ మనసేమి బాగులేదిప్పుడు. లోలోపల ఏదో తెలియరాని అలజడి... ఉదయం నాలుగు మెతుకులు తిని టిఫిన్ బాక్సు ఉన్న సంచి భుజానికి తగిలించుకుని బయలుదేరుతుండగా భార్య వెనకనుంచి 'అయ్యా పిలుస్తున్నారు' అన్నది. ఇసాక్ ముందు గదిలోకి వెళ్ళాడు. కిటికీ పక్క మంచంలో తండ్రి పచ్చగా పండులాగా... ముఖంలో కొడుకును చూడగానే రవ్వంత ఆనందం... అంతలో కన్నీటిపోర...ఇసాక్ తండ్రి పక్కన కూర్చున్నాడు. ఏమీ మాట్లాడలేదు. చెయ్యి తండ్రి భుజంమీద వేశాడంతే. ఇద్దరి మధ్యా మాటలు లేవు. కాని ఒకరి కళ్ళలోనుంచి మరొకరి కళ్ళలోకి ఎడతెగని భావ స్రవంతి. ఎంతో ఆప్యాయత ఒలికే నిశ్శబ్ద సంభాషణలు..కొన్ని క్షణాలాగి పెద్దాయన కదిలి తన తల క్రింద ఉన్న దిండు క్రింద చిన్న పెట్టె చూపించాడు కొడుక్కీ కోడలికీ...ఆ తర్వాత విశ్రాంతి కోరినవాడిలా కళ్ళు మూసుకున్నాడు. ఆయనది పెద్ద వయసేమీకాదు. అరవైకి కొంచెం అటూయిటూ. మంచి వైద్యం చేయిస్తే పదేళ్ళు చక్కగానే బ్రతకగలడు. కాని అంత ఖరీదైన వైద్యం తమకు ఎలా సాధ్యం? సంవత్సరం క్రిందట ఒక ఖరీదైన ఆసుపత్రికి తీసుకువెళితే ఆ ఒక్కసారికే చెమటలు పోశాయి. డాక్టర్లు రకరకాల పరీక్షలు అవసరమైనవీ అనవసరమైనవీ కూడా–చేసి పెద్ద మొత్తం వసూలుచేసి వైద్యం ఎంత ఖరీదవుతుందో కూడా చెప్పారు. ముసలాయన ససేమిరా ఒప్పుకోలేదు. పోతేపోతానన్నాడు. తనకోసం అప్పులు చేసి భంగపడవద్దన్నాడు. మంచానపడ్డాడు. ఇప్పుడిక జరగబోయేదానికి సిద్ధపడటం తప్ప చేసేదేమీ లేదు. కొడుకులు చదువుకుని పెద్దవాళ్ళు కావాలనుకున్నాడు ఇసాక్. వేలకు వేలు ధారపోస్తే తప్ప ఆ చదువులు రావని తెలిసి బుద్ధిమంతుల్లాగా వారిద్దరూ జీవితంలో సర్దుకుపోయారు. తండ్రి ఆరోగ్యం కూడా అంతే... వేలకు వేలు ధారపోస్తే తప్ప అదీ కుదరదు. ఆయన కూడా బుద్ధిమంతుడి వలె మంచంలో సర్దుకుపోయాడు.

ఇసాక్ ఇప్పుడు బస్సును షెడ్‌లో ఉంచి తన సైకిలు తీసుకుని ఇంటిముఖం పట్టాడు. నగరంలో ఏమూలనో ఏదో గొడవ అయినట్టున్నది. జనం వీధులలో పలుచగా ఉన్నారు. ఆ ప్రాంతంలో దుకాణాలు కొన్ని మూతపడి ఉన్నాయి. వీధి దీపాలు కొన్ని మాత్రం మందంగా వెలుగుతున్నాయి. వీధులలో వెలుగు చీకట్లు చారికలు చారికలుగా పరుచుకుని ఉన్నాయి. వీధి చివరి ఇల్లు... దూరం నుంచే ఇసాక్ గుండెలు దడదడలాడాయి. తమ ఇంటిముందు షామియానా... తండ్రిని చూసి కొడుకులిద్దరూ లేచి ఎదురువచ్చారు. ఇసాక్ భార్య మరికొందరు స్త్రీలు మెట్లమీద కూర్చుని ఉన్నారు నిశ్శబ్దంగా.

ఇసాక్ దుఃఖం పొంగివచ్చింది. సైకిలు గోడకానించి ఒక పక్కన కూలబడ్డాడు.

నిమిషాలు గడిచేకొద్దీ అయినవారూ... తెలిసినవారూ... తెలియనివారు కూడా ఎందరో నిశ్శబ్దంగా చేరుకున్నారక్కడికి...

◆ ◆ ◆